క్లుప్తంగా

ఆధునిక పరిజ్ఞానంతో బోధన

బాడంగి: మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆధునిక విజ్ఞానంతో కూడిన ఐఎఫ్‌పీవీ బోర్డుల సహకారంతో పిల్లలకు పాఠ్యబోధన జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10 ఐఎఫ్‌పీవీ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ బోర్డులకు ఇంటర్నెట్ సదుపాయం ఉండడంతో మెరుగైన బోధన చేపడుతున్నట్లు హెచ్‌ఎం డి. సత్యనారాయణ తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

తెర్లాం: మండలంలోని చీకటిపేటలో దోమల నివారణకు అవసరమైన చర్యలను సర్పంచ్ మూడడ్ల పార్వతి ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ రాంబాబు ఆదేశాల మేరకు గ్రామంలోని వీధి కాలువల్లో బ్లీచింగ్, ఫినాయిల్, సోడియం హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు సర్పంచ్ పార్వతి తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

రేగిడి: మండలంలో చాటాయివలస, ఉప్పర్నాయుడువలస గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం ఆరోగ్య తనిఖీలు చేశారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్.అసిరినాయుడు వైద్య పరీక్షలు చేసి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సవరణ నివేదికలు అందించండి..

బాడంగి: బీఎల్‌ఓలు నెలరోజుల పాటు చేపట్టిన ఓటర్ల జాబితాల సవరణ నివేదికలను తక్షణమే కార్యాలయానికి అందజేయాలని తహసీల్దార్ అజురఫీజాన్ అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల సవరణ జాబితాలు కచ్చితత్వంతో చేపట్టినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో హెచ్‌డీటీ చిన్నంనాయుడు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు, డీఈఓ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని డొంకలమిల్లు వద్ద పాడైన పైపులైన్‌కు సోమవారం మరమ్మతులు చేపట్టారు. తాగునీరు వృథాగా పోవడంతోపాటు ప్రయాణికులు, పాదచారులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 21న సాక్షి పత్రికలో వచ్చిన వార్తపై అధికారులు స్పందించారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి సాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ఎంపీడీఓకు సత్కారం

తెర్లాం: ఉత్తమ ఎంపీడీఓగా ఈ నెల 15న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా అవార్డును అందుకున్న రామకృష్ణను మండల వీఆర్‌ఓలు సోమవారం సన్మానించారు. మండలాన్ని అభివృద్ధిపథంలో నడిపించడంలోను, మండల స్థాయి అధికారులందరినీ సమన్వయం చేసుకుని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చేయడంలో ఎంపీడీఓ రామకృష్ణ విశేష కృషి చేస్తున్నారని వీఆర్‌ఓల సంఘ మండల నాయకులు కొనియాడారు.

షెడ్ ధ్వంసంపై ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న యోగా డైరెక్టర్లు

బొబ్బిలి: పట్టణంలోని శ్రీయోగా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ షెడ్‌ను పాడు చేసి బడ్డీ పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని యోగా కేంద్రం డైరెక్టర్లు ఈశ్వర వరప్రసాద్, సత్య, స్థానికులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌ను సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే సీఐ, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినట్లు డైరెక్టర్లు తెలిపారు.

లక్ష్య సాధనకు కృషిచేయాలి

రాజాం సిటీ: కళాశాల స్థాయిలోనే విద్యార్థులు జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషిచేయాలని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తన అలవర్చుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సై పి.నీలావతి, ప్రిన్సిపాల్ పి.స్వప్నహైందవి, జీజే కళాశాల ప్రిన్సిపాల్ ఉరిటి జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో 2023 విద్యాసంవత్సరానికి గాను మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సీహెచ్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడ్‌లకు సంబంధించి ఆన్‌లైన్‌లో సూచించిన విధంగా విద్యార్థులు తమ దరఖాస్తులను ఈనెల 27లోగా పంపించాలన్నారు. దరఖాస్తు చేసుకున్నప్పుడు వచ్చిన యూనిక్ కోడ్‌ను భద్రపరచుకోవాలని సూచించారు. ఈ నెల 28న దరఖాస్తుదారులు తమ సర్టిఫికెట్లను ప్రభుత్వ ఐటీఐలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 30న ప్రభుత్వ ఐటీఐ బొబ్బిలిలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన..



బాడంగి: రావివలసలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



రేగిడి: చిన్నపుర్లిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బాడంగి: రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రావివలస, పూడివలస గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముందుగా రావివలసలో ఇంటింటికీ పర్యటించి సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం పూడివలసలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. అలాగే ఒక్కో ఇంటికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఓ పక్క అభివృద్ధి పనులు చేపడుతూనే.. మరోపక్క సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండానే సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతలకు జమవుతోందని చెప్పారు. జగనన్నకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు. సంక్షేమం కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, పూడి ఆనందరావు, గణేశ్వరరాజు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, పూడి బాలకృష్ణ, వందరావు అప్పయ్య, బొత్స గంగారావు, లక్ష్మంనాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రజా సంక్షేమం

- ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలతో అన్ని వర్గాలకు సంక్షేమం చేరువైందని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలో చిన్నపుర్లి, పెద్దపుర్లి గ్రామాల్లో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు గ్రామాలకు వచ్చి మాయమాటలు చెబుతారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, స్థానిక ఎంపీటీసీ కురిటి రామకోటి, రేగిడి పీఏసీఎస్ అధ్యక్షుడు వంజరాపు అశోక్‌కుమార్, సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం గోవిందరావు, గార రమణ, వావిలపల్లి చంద్రశేఖర్, బంకి చంద్రశేఖర్, మొయ్యి కృష్ణమూర్తినాయుడు, ఎంపీటీసీలు మజ్జి శ్రీనివాసరావు, శ్రీహరిరావునాయుడు, తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, ఎంపీడీఓ నాగమణి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు

నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతోందని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలో పెద్దపుర్లి గ్రామంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత నాలుగేళ్లలో ప్రతీ పంచాయతీలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గడపగడపకు కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడంతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 80 చోట్ల రహదారులను బాగుచేయడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.

నేడు గురవాంలో..

రాజాం: మండలంలోని గురవాం గ్రామంలో మంగళవారం ఉదయం 8 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

సమస్యలను గడువులోగా పరిష్కరించాలి

- ఎంపీడీఓ రమామణి



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను గడువులోగా పరిష్కరించాలని ఎంపీడీఓ రమామణి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఏ కారణం చేతనైనా సమస్యను పరిష్కరించలేకపోతే అందుకుగల కారణాలను అర్జీదారుడికి తెలియజేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటరమణ పాల్గొన్నారు

సకాలంలో..

తెర్లాం: జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఇచ్చిన వినతులను ఎంపీడీఓ స్వీకరించారు. మండలంలోని గోపాలవలస పంచాయతీలో పలు విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని కోరుతూ సర్పంచ్ ప్రతినిధి గొందాల వెంకటరావు, మాజీ సర్పంచ్ గణపతిరావు కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ సమస్యను త్వరగా పరిష్కరించాలని ఏఈ జోగినాయుడును ఆదేశించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డు ఉంటేనే గదులు కేటాయించండి

- ఎస్సై సురేంద్రనాయుడు

రామభద్రపురం: లాడ్జిలకు వచ్చే వ్యక్తుల వద్ద ఆధార్, తదితర గుర్తింపు కార్డులుంటేనే గదులు కేటాయించాలని ఎస్సై సురేంద్రనాయుడు అన్నారు. మండలంలోని పలు లాడ్జీలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు, బెట్టింగ్‌రాయుళ్లు, జూదరులు వంటి వారు లాడ్జీలలో మకాం వేసి తమ కార్యకలాపాలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో లాడ్జీల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మన సంస్కృతి ఎంతో గొప్పది

రాజాం సిటీ: భారతీయ సాంస్కృతిక వైభవం చాలా గొప్పదని శ్రీకాకుళంకు చెందిన డీవీ రమణమూర్తి, ఎం.రాధాకృష్ణ అన్నారు. డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం భారతీయ సాంస్కృతిక వైభవంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారతీయ ప్రాచీన వైభవం, మహర్షుల ఆదర్శ జీవన విధానం, అఖండ భారతావని ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్‌వీజీఎస్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు రుంకు శ్రీనివాసరావు, వీరన్నాయుడు, సులోచన, శాంతికుమారి, సత్యంనాయుడు, గణేష్, భరత్, గోవిందరావు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

రాజాం: స్పందనలో అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని మండలంలోని అన్ని గ్రామ సచివాలయ డీడీఓలకు ఎంపీడీఓ బాసూరీ శంకరరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచిస్తూ సంబంధిత అధికారులకు అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, పలుశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిపై ఆరాతీశారు. పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌జేఈ ప్రభాకరరావు, ఏపీఓ సాయిరాం, ఏపీఎం దధికుమార్, ఏఓ రేనుకాసాయి పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై ఆసక్తి పెంచుకోవాలి



కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేసేందుకు ముందుకురావాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్ కోరారు. మండలంలో దేవుదళ గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంపై సోమవారం అవగాహన కల్పించారు. చీడపీడల నివారణకు వినియోగించే దశకంత కషాయం తయారీ విధానాన్ని వివరించారు. స్థానికంగా లభించే పదిరకాల ఆకులు, పొగాకు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, శొంఠిపొడి తదితర వస్తువులతో దీన్ని తయారు చేసుకోవచ్చన్నారు. ఈ కషాయాన్ని ట్యాంకుకు లీటరు చొప్పున కలుపుకుని పంటలపై పిచికారీ చేసినట్లయితే చీడపీడల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏ ప్రవీణ, యూనిట్ ఇన్‌చార్జ్ గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు శ్రీదేవి, శ్రీలత, గోవిందమ్మ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

రాజాం: ఖరీఫ్ సాగులో సాగు చేస్తున్న పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయడంతో పాటు రైతుల ఈకేవైసీని పూర్తిచేయాలని వ్యవసాయశాఖ ఏడీ కె.చంద్రరావు ఆదేశించారు. వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సోమవారం ఈ-క్రాప్ నమోదుపై సమీక్ష నిర్వహించారు. వరి పంటతో పాటు మిగిలిన పంటల నమోదు కూడా వేగవంతం చేయాలని సూచించారు. ప్రస్తుతం మొక్కజొన్న కాలపరిమితి దగ్గరపడిందని, ఆ పంట సాగు చేస్తున్న రైతుల వివరాలు వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రేనుకాసాయి, సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

వంగర: రైతులు పండిస్తున్న ప్రతీ పంటను ఈ-క్రాఫ్‌లో నమోదు చేయాలని ఏఓ టి.కన్నబాబు అన్నారు. మగ్గూరు ఆర్‌బీకేలో ఏఎస్‌ఓ అచ్యుత్ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలపై వీఏఏలకు సోమవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ 15లోగా ఈ-క్రాఫ్ నమోదు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

ఈకేవైసీ నమోదు చేయకపోతే రైతులకు తీవ్ర నష్టం

- వ్యవసాయశాఖ పనితీరుపై సభ్యులు మండిపాటు
- సకాలంలో ఈ-క్రాప్, ఈకేవైసీ పూర్తి చేయాలి



ఈ-క్రాప్ నమోదుపై ఏఓ కన్నబాబును ప్రశ్నిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: రైతులు సాగుచేస్తున్న పంటలకు ఈ-క్రాప్‌తో పాటు ఈకేవైసీ పూర్తి చేయకపోతే పంటను అమ్ముకునే సమయంలో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఆర్థికంగా నష్టపోతారని పలువురు సభ్యులు అన్నారు. వ్యవసాయశాఖ అధికారులు వెంటనే స్పందించి ఈ-క్రాప్, ఈకేవైసీ పూర్తిచేయాలని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన సోమవారం మండల సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చ సందర్భంగా ఆ శాఖ అధికారుల పనితీరుపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. మండలంలో సుమారు 10 వేల ఎకరాలు సాగులో ఉంటే ఇప్పటివరకు కేవలం 3600 ఎకరాలు మాత్రమే ఈ-క్రాప్, ఈకేవైసీ పూర్తిచేశారని అన్నారు. ఈ-క్రాప్ నమోదు కాకుంటే రైతులు నష్టపోయే అవకాశం ఉన్నందున పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసి రైతుల ఈకేవైసీ పూర్తిచేయాలని కోరారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను హార్టీకల్చర్ అధికారి ఉమామహేశ్వరి వివరించారు. విద్యుత్ శాఖపై జరిగిన సమీక్షలో ఎం.సీతారాంపురం ఫీడర్ 65 కిలోమీటర్లు దూరం ఉన్నందున వీవీఆర్‌పేట, రాజులగుమ్మడ గ్రామాలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేయలేకపోతున్నామని ఏఈ కె.వినయ్‌కుమార్ సభ్యులకు వివరించారు. వీవీఆర్‌పేటలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. శివ్వాం పీఏసీఎస్‌లో రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుందని రాజాం బ్రాంచ్ మేనేజర్ వెల్లడించారు. ఆర్‌బీకేలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఏఈ ఆనందరావు కోరగా.. సకాలంలో బిల్లులు చెల్లిస్తే పనులు చేపడతామని పలువురు సర్పంచ్‌లు వివరించారు. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు విస్తృతంగా అందుతున్నాయని, ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని వైద్యాధికారి సుష్మిత దయాన్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కిమిడి ఉమామహేశ్వరరావు, పున్నాన సత్యనారాయణ, మండల విప్ తెంటు కుమారి, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, డీటీ బూరాడ సుందరరావు, ఏఓ కన్నబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి..

- ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో నడిపించేందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ప్రగతి, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఏఈని ఆదేశించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న సచివాలయ, రైతు భరోసా, హెల్త్, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని మండల పీఆర్ ఏఈ రాజశేఖర్‌కు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీహెచ్‌ఆర్ పంపిణీ, ప్రీస్కూళ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మిలను కోరారు. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎంత విస్తీర్ణంలో ఉభాలు పూర్తయ్యాయని, సాధారణ విస్తీర్ణం ఎంత అని ఏఓ సునీల్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేసేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించాలని ఈఓపీఆర్‌డీ రాంబాబుకు సూచించారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రజావేదిక



బాడంగిలో ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

బాడంగి: మండలంలోని పలు గ్రామాలలో ఉపాధిహామీ పనుల కొలతలు, వేతనదారుల హాజరు, పనుల్లో నాణ్యత లోపించడం వంటి చిన్న చిన్న లోపాలు తప్పితే సామాజిక తనిఖీ ప్రజావేదిక ప్రశాంతంగా ముగిసింది. 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి చెందిన ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన సోమవారం స్థానిక ఇంజినీరింగ్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ డీఆర్‌పీలు తాము గుర్తించిన చిన్న చిన్న తప్పులను వెల్లడించారు. దీంతో జిల్లా ప్రిసైడింగ్ అధికారి పి.జనార్దన్ ఉపాధి సిబ్బందిని మందలించి, ఇటువంటి తప్పులు భవిష్యత్‌లో చేయవద్దని మందలించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఎస్.రవీంద్ర, క్లష్టర్ ఏపీడీ.ఎం.శ్రీనివాసరావు, సెక్షన్ డీవీఓ వెంకటనాయుడు, ప్రోగ్రాం ఆఫీసర్, ఎంపీడీఓ ఆంజనేయులు, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎస్‌ఆర్‌పీ మాధవరావు, డీఆర్‌పీలు, ఏపీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కంపెనీలకు స్థలాలిస్తే ఏడుపెందుకో..?

- లోకేష్, కళా వెంకటరావులకు అప్పట్లో స్థలాలు ఇవ్వలేదా..
- టీడీపీ నాయకులపై ఎమ్మెల్యే శంబంగి మండిపాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో హెరిటేజ్ కోసం లోకేష్‌కు, ఎచ్చెర్లలో కళావెంకట రావుకు అప్పనంగానే భూములు ఇచ్చారా అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రశ్నించారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు స్థలాలు ఇస్తే.. అదేదో నేరంలా టీడీపీ నాయకులు ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సత్య బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు స్థలం ఇస్తే టీడీపీ నాయకులకు కడుపుమంట ఎందుకో అర్థం కావడం లేదన్నారు. పరిశ్రమ ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉపాధి దొరుకుతుందన్న ఆలోచన మానేసి ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం టీడీపీ నాయకులకే చెల్లించదన్నారు. గ్రోత్‌సెంటర్‌లో సత్య కంపెనీకి భూములివ్వడంలో ఎటువంటి అన్యాయం, అక్రమాలు జరుగలేదన్నారు. టీడీపీ నాయకులు కూడా పరిశ్రమల ఏర్పాటు చేస్తే స్థలాలను కేటాయిస్తామన్నారు.

ఉప ఎన్నికల్లో ప్రభుత్వానికే ప్రజల మద్దతు..

ఇటీవల జరిగిన పంచాయతీల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎక్కువ శాతం గెలవడం చూస్తే జగనన్నకే ప్రజలు మద్దతు పలుకుతున్నట్లు తేలిందన్నారు. నియోజకవర్గంలో పది వార్డులకు జరిగిన ఉప ఎన్నికల్లో 8 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే గెలిచారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ మండల అధ్యక్షుడు తమ్మిరెడ్డి దామోధరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చోడిగంజి రమేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిరావాలి..



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి

రామభద్రపురం: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించనున్న సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ, ఈ సమావేశానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. గిరిజన యూనివర్సిటీ భూమి పూజ, సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాకకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించనున్నట్లు చెప్పారు.

సంక్షిప్తంగా...

ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

బొబ్బిలి: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల ఆంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. దేవదాయ శాఖ నుంచి ఆలయ పునఃనిర్మాణానికి ఎమ్మెల్యే శంబంగి రూ. 40 లక్షలు మంజూరు చేయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి చిన్నమ్మలు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు, ఎంపీపీ లక్ష్మి, భక్త మండలి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

రాజాం సిటీ: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు కోరారు. ఈ నెల 24న జరగనున్న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం రాజాంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస వేతనం రూ. 26వేలు అందజేయాలని, ఆప్కాస్‌లో ఉన్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, అనిల్ కుమార్, రవి, రాజేష్, వైకుంఠరావు, కాశి, బాలరాజు, లక్ష్మి, గురువులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ సిబ్బంది ఆందోళన

రేగిడి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కోరుతూ సోమవారం కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఎంటీఎస్ అమలుచేయాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు, డేటా ఎంట్రీ ఆపరేటర్ అప్పలనాయుడు, సూర్యారావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమిస్తేనే సక్సెస్

రాజాం సిటీ: జీవితంలో పెద్ద పారిశ్రామిక వేత్తలుగా స్థిరపడాలంటే సమాజంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్ అన్నారు. జీఎంఆర్ ఐటీలో సోమవారం ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించేందుకు పుష్కలంగా వనరులు ఉన్నాయని, ఇంజినీరింగ్ విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికతో ముందుకుసాగాలని సూచించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ ఐటీలో చదువుకుని పారిశ్రామిక వేత్తలుగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు శ్రీవాణి బీసెట్టి, సీహెచ్ పవన్‌కుమార్, పి.బాలరాజు, పి.రవికుమార్, ఆర్.మాచి లక్ష్మణ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఈడీసీ కన్వీనర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.